# కసి



'అన్నదమ్ములు' సినిమా రిలీజ్ అయి అప్పటికి వారంరోజులయింది!

'సూపర్‌హిట్' అన్న టాక్ వచ్చింది. ఈ సందర్భంగా ఆ చిత్ర నిర్మాత, దర్శకుడైన మోహన్రావును అభినందించడానికి అనేక మంది డిస్ట్రిబ్యూటర్లు, పాత్రికేయులు అతని ఇంటికి వెళ్లారు.

అందరి అభినందనల్ని చిరునవ్వుతో అందుకున్నాడాయన.

"మీ చిత్రంలో అన్నదమ్ముల మధ్య అనుబంధాన్ని అత్యంత హృద్యంగా చూపారు. నాకూ యిలాంటి ఓ తమ్ముడు ఒకడు ఉండి వుంటే బాగుంటుందనిపించింది" ఓ సినీ జర్నలిస్ట్ అన్నాడు.

"తెలుగు చిత్రసీమలోని యిద్దరు ప్రముఖ హీరోలతో చిత్రాన్ని నిర్మించి విజయం సాధించారు. ఇది మీకెలా సాధ్యమైంది?" ఓ డిస్ట్రిబ్యూటర్ అడిగాడు.

మోహన్రావు ఓ నవ్వు నవ్వి, చెప్పాడు-

"నిజానికి నేను సాధించినదేమీ లేదు. వాళ్ళిద్దరే నన్ను సాధించారు. ఒక్క నటనలోనే కాదు, డ్రస్సుల దగ్గర్నుంచి పాటలు, ఫైట్స్, క్లోజప్‌లు అన్నిట్లోనూ లెక్కలు, పోటీలు, గొడవలు... అసలు యీ చిత్రాన్ని పూర్తిచేయగలనని నేను అనుకోలేదు."

"ఈ చిత్రం ముగింపు విషాదాంతం అయినందువల్లే యింత హిట్ అయిందని ఓ టాక్! దీనిపై మీ అభిప్రాయం ఏమిటి?"

"నిజానికి మొదట్లో అనుకొన్న కథ ప్రకారం యిద్దర్లో ఒకరే చావాలి. కానీ, యీ విషయంలోనూ ఆ ఇద్దరూ పోటీపడ్డారు. 'బ్రతికితే ఇద్దరూ బ్రతకాలి. లేదంటే ఇద్దరూ చావాలి'... ఇదీ వాళ్ళ డిమాండ్! ఎలాగూ నిజజీవితంలో ఆ పని చేయలేను... వాళ్ళపై ఎంత కోపం వున్నా! అందుకే యీ చిత్రం ద్వారా ఆ కసి తీర్చుకోగలిగాను!"

- తృప్తిగా అన్నాడా నిర్మాత, దర్శకుడు.

'ఆంధ్రభూమి' వారపత్రిక ... 5 నవంబర్' 1998